చంద్రప్రభ వాహనంపై ఊరేగిన సౌమ్యనాథుడు

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కుర్మాలంకారంలో సూర్య ప్రభ వాహనంపై మాడ వీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి. కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై శ్రీ సౌమ్యనాథ స్వామి మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. మధ్యాహ్నం శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్ట్ సభ్యుల సత్రంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

'ఉపాధి' కూలి లేదాయే!

- ఎనిమిది వారాలుగా అందని వేతనం
- ఉమ్మడి జిల్లాలో రూ.125 కోట్లు చెల్లింపులకు బ్రేక్
- ఆందోళనలో ఉపాధి కూలీలు
- పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉపాధి కూలీల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో రెండు దఫాలుగా ఇటువంటి పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. రోజూ రెక్కాడితే గానీ కడుపు నిండని కష్టజీవులకు సకాలంలో కూలి డబ్బులు జమచేయకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. 2025-26 మే మొదటి వారం నుంచి జులై మొదటి వారం వరకు కూలి డబ్బులు చెల్లించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి కూలి డబ్బులపై ఆధారపడి జీవనం గడుపుతున్న కూలీల కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. డ్వామా యంత్రాంగం రోజు వారీగా ఉపాధి కూలీ పనిదినాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నప్పటికీ కూలి డబ్బులను విడుదల చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. 2025-26 మార్చి, ఏప్రిల్ మాసాల్లో లేబర్ వేజెస్, మెటీరియల్ వేజెస్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలుగా విడుదల చేయడంతో ఉపాధి కూలీలతోపాటు సిబ్బంది సైతం ఊపిరి పీల్చుకున్న సంగతి తెలిసిందే.

వైఎస్ఆర్ కడప జిల్లాలో 4,14,858 లక్షల మంది ఉపాధి జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. 3,04,994 లక్షల మంది చురుకుగా ఉపాధి పనులు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని 15 మండలాల్లో 1,39,0725 కుటుంబాలు జాబ్‌కార్డును కలిగి ఉన్నాయి. 2,22,318 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. కడప జిల్లాలో 2025 ఏప్రిల్ ఒకటి నుంచి మే 10వ తేదీ వరకు 54.79 లక్షల పనిదినాలు చూపించారు. అనంతరం 42 రోజుల పాటు ఉపాధి కూలీలు నిరీక్షిస్తున్నారు. మే 10 నుంచి జులై ఏడవ తేదీ వరకు పనిచేసిన కూలీలకు రూ.90 కోట్లు మేర వేతనాలు రావాల్సి ఉంది. కడప జిల్లాలో రూ.42 కోట్లు, అన్నమయ్య జిల్లాలో రూ.48 కోట్లు కూలి డబ్బులు జమ చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాదికి సంబంధించిన మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.35 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. లేబర్ వేజెస్, మెటీరియల్ కాంపొనెంట్ వేజెస్ వెరసి మొత్తం రూ.125 కోట్లు ఉపాధి హామీ బకాయిలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో ఒకవైపు ఖరీఫ్, మరోవైపు అకడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యం కూలి డబ్బుల అవసరం ఏర్పడింది. జూన్‌లో పంటల సాగు, విద్యార్థుల అడ్మిషన్లు, ఫీజుల ఖర్చులు తడిసి మోపెడవుతున్న సంగతి తెలిసిందే. ఉపాధి కూలి డబ్బులను ఎప్పుడు జమ చేస్తారని ఎదురు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. నిత్యావసరాల ధరలు దరువు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వంట నూనె ధర రూ.150 పైగా పలుకుతోంది. పప్పుల ధరలు కిలో రూ.120 వరకు ఉన్నాయి. ఉపాధి కూలీలు బతకులు దినదిన గండాన్ని తలపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఉపాధి జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలన్నీ ఉపాధి కూలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి దుర్భర పరిస్థితుల నేపథ్యంలో నెలల తరబడి కూలి డబ్బులు పెండింగ్‌లో పెడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పేదలకు కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కించడం ఏమిటో తెలియడం లేదు. జిల్లాలో వ్యవసాయ పనులు లేని సమయంలో పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెచ్చిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాల్సి ఉంది.

ఆరు వారాలుగా ఎదురుచూస్తున్నాం

ఉపాధి బిల్లులు కోసం ఆరు వారాలుగా ఎదురు చూస్తున్నాం. గతంలో ఒక వారం పనిచేస్తే మరో వారంలో బిల్లులు వచ్చేవి. ప్రస్తుతం నెలల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. జీవనం సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. ఉదయం, సాయంత్రం పనులు కల్పించాలి. పనిముట్లు కూడా ఉచితంగా ఇవ్వాలి.

- శ్రీరాములు, ఉపాధి కూలీ, మాధవరం, రాయచోటి.

కూలి డబ్బులు త్వరగా చెల్లించాలి

ఉపాధి హామీ పనికి వెళ్లి జీవనం సాగిస్తున్నాను. గతంలో వారానికి ఒకసారి ఇచ్చేవారు. ప్రస్తుతం ఆలస్యం అవుతోంది. వ్యవసాయం పనులు కూడా వెళదామనుకుంటే వర్షాలు లేక వ్యవసాయ పనులు కూడా లేవు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలి.

- సుబ్బమ్మ, ఉపాధి కూలీ, రాయచోటి.

జీవనం ఇబ్బందిగా ఉంది

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిరోజు కూలి పనులకు వెళుతున్నప్పటికీ సరిగా కూలి డబ్బులు అందడం లేదు. రెండు నెలలకు సంబంధించిన బిల్లులు బ్యాంక్ ఖాతాలో పడతాయని చెప్పినప్పటికీ అవి అందలేదు. ఉపాధి పనులు చేసుకుంటూ జీవించే పేద ప్రజలకు ప్రతివారం నగదు చెల్లిస్తే కుటుంబ పోషణ సులభంగా ఉంటుంది. నెలలు తరబడి బిల్లుల బకాయిలు ఉంటే కష్టతరమవుతుంది .వెంటనే అధికారులు బకాయిలను చెల్లించాలి.

- వీరారెడ్డి, ఉపాధి కూలీ, సిద్ధారెడ్డిపల్లి, చాపాడు మండలం.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ఎస్‌పి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన ఎస్‌పి రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుద్ధుడి తల తీసి చేతిలో పెట్టిన సంఘటన పట్ల శాంతియుత నిరసన దీక్షలు చేస్తున్న బాస్ అధినేత పిటిఎం శివప్రసాద్, అతని అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా బెదిరింపు ధోరణిలో వ్యవరించారన్నారు. 9న దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాలో తీవ్ర నిర్బంధం ప్రయోగించి సమ్మెను అణచివేయాలని ఎస్‌పి విశ్వ ప్రయత్నం చేశారని విమర్శించారు. ఉగ్రవాదులను చూసినట్లుగా ప్రజలను, ప్రజాసంఘాలను పట్ల వ్యవహరించడం అత్యంత హేయమైన చర్యన్నారు. సాధారణంగా ప్రజా సమస్యల మీద తమ గొంతును వినిపించడానికి రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛను, నిరసనను తెలియజేసే హక్కును కల్పించిందని, ఎస్‌పి స్థాయిలో ఆ హక్కును కాలరాస్తున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన జిల్లాస్థాయి ఉన్నతాధికారే ఈ విధమైన రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడతుంటే ఇక కింది స్థాయిలో ఏ విధంగా ఉంటుందో ఊహించుకోచ్చునన్నారు. నిజంగా శాంతిభద్రతలు కాపాడాలనే లక్ష్యం ఎస్‌పికి ఉంటే భూకబ్జాల పట్ల, ఇసుక మాఫియా పట్ల, గంజాయి ముఠాల పట్ల, కాల్ మని వేధింపుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన రక్షక భటులే కింది స్థాయిలో భూ కబ్జాదారులకు, ఇసుక మాఫియాకు, కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న వారికే అండగా ఉంటూ, బాధితులకు న్యాయం చేకూర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న అధికారి రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి ప్రజల పైన, ప్రజాస్వామిక వాదుల పైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ రాజ్యాంగ హక్కులను హరించి వేసే విధంగా వ్యవహరిస్తున్న వారికి ఆ పదవిలో కొనసాగే అర్హత ఏమాత్రం లేదన్నారు. ఎస్‌పి వైఖరి మార్చుకోని పక్షంలో అన్ని పార్టీలను, ప్రజాసంఘాలను ప్రజాస్వామిక వాదులను ఐక్యం చేసి జిల్లా స్థాయి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, నరసింహ పాల్గొన్నారు.

ఎస్‌పిపై కేసు నమోదు చేయాలి

పీలేరు: కుల వివక్షతో బౌద్ధులను అవమానించి, దురుసు ప్రవర్తనతో దళిత నేతల్ని గాయపరచి, బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించిన ఎస్‌పి విద్యాసాగర్ నాయుడుపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పీలేరులో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య అధ్యక్షతన ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదఘటనపై సకాలంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్ యాదవ్, శ్రీనివాసులు, వెంకటేష్, చంద్రయ్య, నారాయణ, సుధాకర్ బాబు, మల్లికార్జున, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాయచోటి: గౌతమ బుద్ధుడి తల నరికిన నిందితులను కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు యుగంధర్ పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ కేసును నీరుగాచేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గౌతమ బుద్ధుని తలను ఖండించిన దుర్మార్గులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా కార్యదర్శి వై.వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతృప్తి చెందేలా సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని, మార్గదర్శులను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేదరికం లేని సమాజం - పి4 కార్యక్రమం, ఐవిఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాల సేకరణ, మలేరియా, డెంగీ, తదితర వ్యాధుల వ్యాప్తి, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ శ్రీధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తి లేకుండా చూడాలని సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన వాటిపై సమీక్షిస్తూ పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలతో సఖ్యతగా మేలగడం వంటి అంశాలలో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీహరి చామకూరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ శాఖలు వారి పరిధిలో ఉన్న హాస్టళ్లను అన్నింటిని తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలన్నారు. కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్లకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఎస్ఇ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా రైతులకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వ్యాధుల వ్యాప్తి లేకుండా చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులు ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

సచివాలయ ఉద్యోగి బలవన్మరణం

- బదిలీయే కారణమంటున్న ఉద్యోగులు

మృతి చెందిన రాజేశ్వరి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లె మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎస్.రాజేశ్వరి(32) ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలలోకి వెళితే...రైల్వేకోడూరులోని స్వగృహంలో ఉరి వేసుకోకున్నారు. రాజేశ్వరి సొంగ్రామం కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని రామేశ్వరం. 2019 నుంచి బాలిరెడ్డిపల్లి సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా ఆమె పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు బదిలీ ఆయ్యారు. తనను కడప జిల్లాకు బదిలీ చేయాలని అధికారులను ఆమె కోరారు. అధికారులు వినకపోవడంతో మనస్థాపంతో ఉరివేసుకున్నారని సచివాలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. తనను కడపకు బదిలీ చేస్తే తన కుటుంబాన్ని చూసుకోవడానికి వీలుగా ఉంటుందని తన కుటుంబానికి తానే పెద్దదిక్కుగా ఉన్నానని అనేకమార్లు అధికారులు చుట్టూ తిరిగిన స్పందించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం రైల్వేకోడూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కాగా మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి చెల్లి, తమ్ముడు ఉన్నారు. చెల్లికి పెళ్లైన నెలకి భర్త చనిపోవడంతో కుటుంబ భారం అంతా మృతురాలిపై పడింది. రాజేశ్వరి మృతదేహానికి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సంఘటనపై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి చెందిన విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. రాజేశ్వరి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

డిప్యూటీ సర్వేయర్ ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హసీన్

మదనపల్లె అర్బన్: పెద్దమండ్యం మండల డిప్యూటీ సర్వేయర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన హసీన్‌తాజ్ పెద్దమండ్యం మండలంలో డిప్యూటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తోంది. తహశీల్దారు తేజశ్విని చులకనగా మాట్లాడటం, వేధింపులకు గురిచేస్తోంది. తీవ్ర మనస్తాపానికి గురైన హసీన్‌తాజ్ కార్యాలయంలోనే వెంట తెచ్చుకున్న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తోటి ఉద్యోగులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పెద్దమండ్యం పోలీసులు విచారిస్తున్నారు.

రాజేశ్వరి ఆత్మహత్యపై విచారణ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సూర రాజేశ్వరి(32) ఆత్మహత్య ఘటనపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని రాజంపేట సబ్ కలెక్టర్, పోలీస్ శాఖ అధికారులను ఆదేశించినట్లుగా కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిఆర్ ఎస్ఇ ఇచ్చిన నివేదిక ప్రకారం బాలిరెడ్డిపల్లిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పట్టణంలోని ఎం.జి. రోడ్డు వీధిలో ఉన్న ఒక ఇంటిలో నివసిస్తున్న రాజేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిం దని పేర్కొన్నారు. ఆమెకు కొన్ని కుటుంబ సమస్యలు ఉన్నాయని, ఒకే గ్రామ సచివాలయంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 377 మంది ఇంజి నీరింగ్ అసిస్టెంట్లలో 374వ స్థానంలో ఉందని ఈ కారణంగానే ఇటీవల నిర్వ హించిన కౌన్సెలింగ్‌లో ఆమెను సుండుపల్లి మండలంలోని సొంతం వారిప ల్లెకు బదిలీ అయ్యారని పేర్కొన్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలి యలేదని, పూర్తిస్థాయి నివేదిక కోసం అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

మానసిక కుంగుబాటుతోనే హసీన్ ఆత్మహత్యాయత్నం

మానసిక కుంగుబాటు వల్లే డిప్యూటీ సర్వేయర్ కుమారి షేక్ హసీన్‌తాజ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దమండెం మండలం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారి షేక్ హసీన్ తాజ్ ఐదు అవిల్ మాత్రలను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వే శాఖ ఎడి భరత్ కుమార్ ఇచ్చిన నివేదిక ప్రకారం అవిల్ మాత్రలను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హసీన్ తాజ్‌ను అపస్మారక స్థితిలో గుర్తించిన సిబ్బంది వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లుగా పేర్కొన్నారు. డాక్టర్లు ఆమెను ఈ ఘటనపై పలు ప్రశ్నలు అడగగా అవిల్ మాత్రలను మింగినట్లుగా తెలిపిందని పేర్కొన్నారు. గతంలో రాయచోటి కలెక్టరేట్‌లోని ఎడి సర్వే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు కూడా తన మానసిక కుంగుబాటు కారణంగా ఆత్మహత్యకు పాల్పడతానని బెదిరించినట్లుగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉందని కొన్ని రోజులపాటు డాక్టర్ పర్యవేక్షణలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను ఆదేశించినట్లుగా పేర్కొన్నారు.

పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు ఉందని అదే లక్ష్యంగా పేరెంట్స్, టీచర్ల సమావేశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురు వారం కె.రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తల్లిదం డ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు అభివృద్ధి చెందే అంశాలను గుర్తించి అన్ని రంగాలలో శిక్షణ ఇచ్చి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, హెచ్ఆర్‌డి మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో గత ఏడాది కాలంలో విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను ప్రక్షాళన చేయడంతో పాటు అనేక మార్పులు తీసుకొచ్చి ప్రయివేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన యూనిఫామ్ కిట్లను, ప్రస్తుత ప్రభుత్వం సరఫరా కిట్లను యూనిఫామ్‌ను తల్లితండ్రులు గమనించాలన్నారు. మన ఇంటిలో తల్లిదండ్రులు కల్పించే నాణ్యమైన భోజనం, చదువు, తదితర నాణ్య మైన వసతులు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచే విధంగా తల్లిదండ్రులు కూడా వారిపై దృష్టి సారించాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం చర్యలతో పాటు తల్లితండ్రులు సహకరిస్తే డ్రగ్స్ నివారణ చేయుటకు మరింత సులభతరం అవుతుందన్నారు. గతంలో పిల్లలను పోషించడం కోసం తల్లిదండ్రులకు చాలా కష్టంగా ఉండేదని తెలిపారు. తల్లికి వందనం పేరుతో సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థలో సమూలన మార్పులు తీసుకురావడానికి ఈ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పిటిఎం కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల ప్రతిభను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాల ప్రగతితో పాటు, విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యం, ఆటలు, క్రీడలు లాంటి విన్యాసాలలో ప్రావీణ్యత, తోటి విద్యార్థులతో ప్రవర్తన, భావవ్యక్తీకరణ, పరస్పర సహకారం, నాయకత్వ లక్షణాలు తదితర విషయా లన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపిం చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే తల్లిదండ్రులు పిల్లలకు ఏ విషయంలో ఏ ప్రతిభవంతు గుర్తించి దానిని ప్రోత్సహించాలని తెలిపారు. పిల్లలు కూడా వారికి నచ్చిన విష యంలో బేసిక్స్ నుంచి సంపూర్ణంగా అర్థమయ్యే విధంగా చదువుకోవాలన్నారు. పాఠశాలల అభివృద్ధి, పిల్లలలో అభ్యాసనా సామర్థ్యం తదితర అంశాలను తల్లిదండ్రులతో చర్చించి వారి సూచనలను పరిగణలోకి తీసుకొని పిల్లల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంచే విధంగా మొక్కలను నాటే ఉద్దేశంతో పిల్లలు తల్లి పేరుతో మొక్క నాటి వాటిని సంరక్షించే విధంగా వినూత్నమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు పాఠశాల ఆవరణంలో, పాఠశాల పరిసరాలలో, ఇంటి ఆవరణంలో మొక్కలను తల్లితండ్రుల పేరుతో నాటి వాటిని సంరక్షించాలని తద్వారా మొక్క ఎదుగుదల పర్యావరణానికి తోడ్పాటునిస్తుందన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ విద్యార్థులకు గ్రీన్ కార్డులు పంపిణీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు పాఠశాల ప్రధానో పాధ్యాయులు నాగమునిరెడ్డి పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలను కడిగి మాతృ భక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో డిఇఒ సుబ్రహ్మణ్యం, ఎంఇఒలు బాలాజీ నాయక్, శివారెడ్డి, సమగ్ర శిక్ష సిఎంఒ కరుణాకర్, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్ సాలయ్య, ప్రాథమిక పాఠశాల ఛైర్మన్ మల్లమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్టు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-రామాపురం

నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పరచడమే లక్ష్యమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలో గురువారం ఆయన తన సోదరుడు లక్ష్మి ప్రసాద్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. కొండపల్లి గ్రామంలోని వెంకట్రామిరెడ్డి ఇచ్చిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలోలక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కత్తి మహేష్ వర్ధంతి

ప్రజాశక్తి-పీలేరు : ప్రశ్నించే తత్వాన్ని ప్రజల్లో నింపినోడు కత్తి మహేష్ అని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. గురువారం పీలేరులో ఎంఎస్‌పి సీనియర్ నాయకుడు ఎన్.సుధాకర్ బాబు అధ్యక్షతన ప్రజా సంఘాలు కత్తి మహేష్ 4వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తిరుపతి జిల్లా, ఎర్రావారిపాలెం మండలంలోని మారుమూల ప్రాంతంలో పుట్టిన కత్తి మహేష్ ఓ మంచి రాజకీయ, సినిమా విశ్లేషకుడిగా అపారమైన పట్టు సాధించారన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలపై ఎప్పటికప్పుడు ప్రశ్నస్తూ ఎస్‌సి, ఎస్‌టిల అణచివేతలను వ్యతిరేకిస్తూ రాజ్య బహిష్కరణకు గురై చరిత్రకెక్కిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఓ సినీ రచయిత, నటుడు, దర్శకుడిగా సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందగలిగాడని చెప్పారు. ఈయన ప్రధానంగా మనువాదం మీద పెద్ద ఎత్తున పోరాటం చేసి సమాజన్ని ప్రభావితం చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య, బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాస్, సిపిఐ వెంకటేష్, మాలమహానాడు ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు మద్దెల అమృత తేజ, బిసి నాయకులు మహేష్ యాదవ్, గిరిజన వికాస్ సంస్థ విజయ్, శ్రీనివాసులు, ఆంజనేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు శేషాద్రి, సద్దల ప్రేమకుమార్, నాగేశ్వర, కుమార్, బాలరాజు, అశోక్, మాలమహానాడు నాయకులు రామాంజులు, రమేష్ పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న

ప్రజాశక్తి-రాయచోటి

అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.శ్యామ్ పేర్కొన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఊటుకూరి కిరణ్ కుమార్ కుమార్తె మనస్వి మొదటి పుట్టినరోజు సందర్భంగా భవిత కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా కుమార్తె మనస్వి మొదటి పుట్టినరోజు సందర్భంగా నా వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే అన్నదాన కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ ఛైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, మాజీ అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి, కోశాధికారి లయన్ కె.మనోహర్ రాజు, లయన్ షంషీర్ వలి, భవిత కేంద్రం సిబ్బంది, జనార్ధన్, త్రిలోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ రాయచోటి సభ్యులు విద్యా సామగ్రిని పంపిణీ చేయడం సంతోష దాయకమని ఎంఇఒ రామకృష్ణుడు పేర్కొన్నారు మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ, బి.రాచపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యుడు అంజన రెడ్డి ఆర్థిక సహాయంతో 36మంది విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చాలా పాఠశాలలో పేద విద్యార్థులు ఉన్నారని లయన్స్‌క్లబ్ రాయచోటి వారు సహృదయంతో అభ్యసన సామగ్రిని అందిస్తే పేద విద్యార్థులను విద్యా పరంగా ఆదుకున్న వారవుతారని అన్నారు. దాత అంజనారెడ్డి మాట్లాడుతూ ఎంఇఒ సలహాను మిగిలిన సభ్యులతో సమావేశంలో మాట్లాడి సాధ్యమైనత వరకు ప్రయత్నిస్తామని తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్ర, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్ చంద్ర, కార్యదర్శి షేక్‌ఇందాద్ అహ్మద్, కోశాధికారి మనోహర్‌రాజు, సభ్యుడు షంషేర్వలి, గ్రామ టిడిపి నాయకులు పట్టాభిరెడ్డి, శ్రీనివాసులు శివారెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

యువ ఇంజినీర్‌కు 'ముక్కా' నివాళి

ప్రజాశక్తి-పుల్లంపేట

గుండెపోటుతో మృతి చెందిన పుల్లంపేట మండలంలోని దండ్లో పల్లె గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు పూండ్ల మనీ కుమారుడు శివతేజ మృతదేహానికి కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలోకూటమి నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా బాలరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల డిప్యూటీ ఎంపిడిఒగా బి.బాలరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్‌బాబును కలిసి బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పుంగనూరు మండలంలో పనిచేస్తున్న బి.బాలరాజు పదోన్నతి పై నిమ్మనపల్లి మండల డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మండలంలో ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడానికి, పారిశుధ్య నిర్వహణను చేపట్టడానికి ప్రత్యేక కార్యచరణను రూపొందిస్తా మని తెలిపారు. మురుగునీటి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యన్.క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వేదవ్యాసుడు ఆదిగురువులలో అత్యంత విశిష్ట స్థానాన్ని అధిరోహించినవారు కనుకనే గురుపౌర్ణమిని వ్యాసపౌర్ణమిగా అబి వర్ణించబడిందని అన్నారు. వ్యాసం అంటే వ్యాప్తం కావడం మనవివేకం అన్నది వ్యాప్తి కావాలన్నారు. వివేకం అంటే ఏది మంచి, ఏది చెడు శాస్త్రీయంగా చెప్పేది వివేకం అంటే ఏది శాశ్వతం, ఏది అశాశ్వతం కాదని తెలిపేదనని అన్నారు. గురు పౌర్ణమి అన్నది సకల గురువులకూ అంకితమైనదన్నారు. తల్లితండ్రులందరికీ, ఆచార్య గురుదేవుళ్ళందరికీ గురుపౌర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. గురువులు దైవంతో సమానమని,గురువులను గౌరవిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.గురువులు చెప్పే పాఠాలు,సందేశాలను చక్కగా అవగాహన చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. **తంబళ్లపల్లి:** మండలంలో గురు పౌర్ణమి వేడుకలను అన్ని ఆలయాల్లో నిర్వహించారు. మల్లయ్య కొండ మల్లికార్జున స్వామి ఆలయం, శేష సాయిబాబా ఆలయం, శ్రీకోదండరామాలయం, కోసువారిపల్లె ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయాలకు ఉదయమే భక్తులు పోటెత్తారు.స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక, పూజలు అభిషేకాలు నిర్వహించారు. **వాల్మీకిపురం:** వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని షిరిడి సాయిబాబా మందిరంలో అభిషేకం, విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో విశేష భక్త జనం నడుమ వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాద, అన్న వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలల్లో అర్చకులు, భక్తులు, పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి-వీరబల్లి

స్వయం సహాయక సంఘాలు బలోపేతమవ్వాలని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి అన్నారు. గురువారం వంగిమళ్ళ కస్పా ఉర్దూ పాఠశాలలో సమైక్య 3వ మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాఖ్యలో ఉన్న 24 సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉన్నాయని అన్నారు. ఎటువంటి బకాయిలు లేకుండా సంఘాలు నడుస్తున్నాయని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20.15 లక్షలు లావాదేవీలు జరిగి రూ.1.12లక్షలు ఆదాయం వచ్చిందని అన్నారు. గత సంవత్సరంలో పనిచేసిన పదాధి కారులను సత్కరించారు. వార్షిక నివేదిక సభ్యులకు వినిపించిన తర్వాత నూతన పదాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారని సమాఖ్య అధక్షురాలిగా షేక్. రాశిదా, కార్యదర్శిగా షేక్. మునీరా, కోశాధికారిగా కె.నీలావతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిసి సుధాకర్, విఒఎ మసరూర్ జహాన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని దిగువగొట్టి వీడు గ్రామం జంగంపల్లిలో గురువారం టిడిపి నాయకులు మద్దిరాల అనిల్ కుమార్, దేవ గోపాల్ నాయుడు, దేవరెంటి నాగేశ్వర సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సతీమణి హరితమ్మ, సోదరులు టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, మేనల్లుడు మౌర్య రెడ్డి, మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల లో ఇచ్చిన హామీల ప్రకారం పెంచిన పెన్షన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం అన్ని కూడా అందాయని ప్రజలు హర్ష వ్యక్తం చేశారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బొజ్జ ఆదినారాయణ, బాలాజీ నాయుడు, రాజేంద్ర నాయుడు, కామినేని బాలాజీ, శంకరయ్య, పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ట్రై సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి రాయచోటి : చెత్త సేకరణ సామర్థ్యాన్ని పెంచేందుకు కేవలం లక్ష రూపాయల ఖర్చుతో తయారు చేయించిన ట్రై సైకిల్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరి, గురువారం మండలంలోని పెమ్మాడపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ సహజీయా సుల్తానాకు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పంచాయతీ సెక్రెటరీ ఉద్దేశించి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో చేయించిన ట్రైసైకిల్‌ను వినియోగించుకుని గ్రామపంచాయతీ పరిధిలోని 100 శాతం ఇళ్ల ద్వారా చెత్తను సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమం లో డిపిఒ రాధమ్మ, ఎంపిడిఒ సురేష్ బాబు, పెమ్మడ పల్లి సర్పంచ్ వల్లపు వాసు, మాజీ సర్పంచ్ బండపల్లి బసయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయడం ఎంతో సంతోషాన్నిస్తుందని నియోజకవర్గ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జయం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పిటిఎం 2.0 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రూ.35 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి ప్రభుత్వ పాఠశాల అభి వృద్దే లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. రూ.9వేల కోట్లు తల్లికి వందనం పథకం కింద రూ.31 వేల విద్యార్థులకు తమ ఖాతాల్లో నగదు జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, డివైయు లోకేశ్వర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జ్యోతి, మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్, సహకార బ్యాంక్ చైర్మన్ చంద్ర కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, వైస్ చైర్మన్ సనావుల్లా, మాజీ ఎంపిపి నాగభూషణం రెడ్డి, టిడిపి ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, యోగేష్ రెడ్డి, ఎంపిడిఒ భానుమూర్తి రావు, ఎంఇఒ కరీముల్లా, ఇఒ అశోక్, డిటి సయ్యద్, తల్లిదండ్రులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం :** మండలంలోని కొండవాండ్లపల్లి జడ్పి హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ప్రధానోపాధ్య యురాలు సుధారాణి అధ్యక్షతననిర్వహించారు ఈ సమావేశానికి డిఇఒ సుబ్రహ్మణ్యం, మండిపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు, ఎంఇఒ2 జయచంద్ర, టిడిపి నాయకులు సహదేవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజారావు తెలుగు ఉపాధ్యాయసంఘం నాయకుడు రామచంద్ర ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. **సుండుపల్లి:** మండలంలోని కెజిబివి బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శివశృతి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పిటిఎంను ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సురేషబాబు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలకు కావాల్సిన మౌళిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువుల పురోగతిపై తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల తల్లుల పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. **నిమ్మనపల్లె :** పభుత్వ ఆదేశాల మేరకు నిమ్మనపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఎంఇఒలు పద్మావతి, నారాయణలు తెలిపారు. మెగా పిటిఎం 2.0ను పాఠశాలలో ఒక పండుగ వాతావరణంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నిర్వహించారు. పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాఠశాలల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌బాబు, మండల అధికారులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లె :** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ వేడుకగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ శ్రీగోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, గత విద్యా సంవత్సరంలో మెరిట్ సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయి శంకర్ రెడ్డి, శివ పార్వతిదేవి, శ్రీదేవి, రమణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగురెడ్డిపరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు రెడ్డయ్య, టిడిపి మండల సీనియర్ నాయకులు తాటి గుంట్ల శ్రీధర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి లు తెలపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో, జడ్పి పాఠశాలలో, కళాశాలలో, మెగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం పండగ వాతావరణాన్ని మురిపించే విధంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చేపట్టారు. జడ్పి పాఠశాలలో ట్రిబుల్ ఐటీ ఇడుపులపాయలో సీటు వచ్చిన షైనింగ్ స్టార్ట్ అవార్డు పొందిన విద్యార్థులకు తాటి గుంట్ల శ్రీధర్ రెడ్డి, వై.సుభాష్ రెడ్డి ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. ఆయా పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపిడిఒ జవహర్‌బాబు, ఎంఇఒ కృష్ణయ్యలు, ఎస్ఐ నరసింహారెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విఆర్‌డిస్ సురేందర్ రెడ్డి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షత నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం పండుగ వాతావరణంలో జరిగింది. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా మండల విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, విజయ కుమారి, గొంటుముక్కుల వెంకటరమణ, శిల్పి ఆనందాచారి , జీవి ప్రసాదరావు, మస్తాన్ , గీత, గౌరీ , ఆర్ వి రమణమ్మ, జ్యోతి ప్రియ, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ ప్రక్షాళనతో మెరుగైన ఫలితాలు : 'చమర్తి'

రాజంపేట : ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పర సహకారంతో విద్యార్థులకు అండగా నిలిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా రాజంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తల్లికి వందనం పేరుతో ప్రతి ఇంటిలో ప్రతి చిన్నారి చదువుకునేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందని అన్నారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరి శ్రీనివాసరాజు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్‌వి.రమణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట : విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న జగన్‌మోహన్‌రాజు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న దశరథ

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్తుపై దృష్టి సారించాలని హెడ్ కానిస్టేబుల్ దశరథ తెలిపారు. గురువారం మండలంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాలలో నిర్వహించిన మాదకద్రవ్యాల నియంత్రణపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, అధ్యాపకులను గౌరవించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మాదక ద్రవ్యాలైన డ్రగ్స్, సిగరెట్లు, మత్తుపదార్థాలకు, బానిస కాకుండా ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. కళాశాలలో ఉన్నంతవరకు బాలురు, బాలికలను అక్కచెల్లెళ్ల వలె చూసుకోవాలని, బాలురను, బాలికలు అన్నదమ్ముల వలె మెలగాలని తెలిపారు. బాలికల పట్ల బాలురు అసభ్యంగా ప్రవర్తించి ర్యాగింగ్ వంటి కార్యక్రమాలకు పాల్పడకుండా సోదరా భావాలతో మెలగాలన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ వంటి కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వారి పైన కేసులు నమోదు చేయ డమే కాకుండా కఠినంగా శిక్షించడం జరుగుతుందని గుర్తు చేశారు. అనంతరం తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డప్పరెడ్డి, సాయి పవన్ కుమార్, మహిళా పోలీస్ శోభారాణి, తదితర అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం : పీడీ

ప్రజాశక్తి- చిన్నమండెం

మండల కేంద్రం చిన్నమండెంలోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వద్ద గురువారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకట మోహన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై అవగాహన కల్పించారు. 20 సెంట్ల భూమిలో 30 రకాల సేంద్రియ విత్తనాలను రైతులు విత్తారు. ఈ కార్యక్రమానికి ఎఇఒ బ్లేస్సి , మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సునీత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయలు, ఆకుకూరలు తినడం వలన శరీరానికి పౌష్టిక ఆహారం అంది ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. వెంకట మోహన్ మాట్లాడుతూ రైతులకు సేంద్రియ విత్తనాలను అందిస్తామని తెలిపారు. విత్తనాల్లోని వైవిధ్యం వల్ల కీటక వ్యాధుల ప్రభావం తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చునని అన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులకు రైతు సాధికారిక సంస్థ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందడం ఈ మోడల్ ద్వారా సాధ్యమవుతుందని చెప్పారు. రైతులు పెద్ద సంఖ్యలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి విత్తనాల స్వయం సమృద్ధిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పద్మావతి, వీణ రెడ్డయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యయసాయ పద్ధతుల్లో విత్తనాలను విత్తుతున్న సిబ్బంది

నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - నందలూరు

శ్రీ సౌమ్యనాథ స్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం నందలూరులో ట్రాఫిక్ మళ్లింపు చేయడం జరుగుతుందని ఎస్ఐ మల్లి కార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొత్తపి, చెన్నయ్యగారి పల్లి లేబాక గ్రామాల వైపు నుంచి నందలూరుకు వచ్చే ప్రజలు సౌమ్యనాథ స్వామి ఆలయం వైపు దారిలో రాకుండా ఈదరపల్లి, దురా పురం మీదుగా నందలూరు టౌన్ లోకి వెళ్లాలని అన్నారు. శ్రీ సౌమ్యనాథ స్వామి కల్యాణానికి వచ్చే భక్తులు మాత్రం నందలూరు హరిజనవాడ దగ్గర ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపి గుడి వద్దకు కాలినడకన రావాలన్నారు. నందలూరు వైపు నుంచి సౌమ్యనాథ స్వామి కళ్యాణానికి వచ్చు భక్తులు నందలూరు షాది ఖానా వద్ద ఉన్న పార్కింగ్‌లో వాహనాలు నిలుపుకొని గుడి వద్దకు కాలినడకన రావాలని కోరారు. ప్రజలు, నాయకులు, మీడియా ప్రతి నిధులు, పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

వైసిపి నాయకుడి మృతి బాధాకరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వైసిపి సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకరమైన విషయమని మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అగ్రహారం పంచాయతీ, పూలవాండ్లపల్లికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు సిద్దారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన వైసిపి మండలా ధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులతో కలసి సిద్దారెడ్డి మృత దేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిద్ధారెడ్డి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి,నాగరాజు, మహేశ్‌కాంత్, మల్లికార్జున పాల్గొన్నారు.

మదనపల్లెలో ఓపెన్ హార్ట్ సర్జరీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : స్థానిక పట్టణంలోని విశ్వకిరణ్ ఆస్పత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా జిల్లాలోనే మొదటిసారిగా ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించడం గర్వకారణంగా ఉందని డాక్టర్లు బృందం చంద్రశేఖర్, హేమప్రియ, సులేమాన్ తెలిపారు. గురువారం స్థానిక విశ్వ కిరణ్ ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసుకున్న రవిచంద్రతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ల బృందం మాట్లాడుతూ ఈ నెల 4వ తేదిన అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన బాధితుడు రవిచంద్ర (60)కి వైద్య పరీక్షలు నిర్వహించి ఓపెన్ హార్ట్ సర్జరీ చేశామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద అన్ని ఏర్పాట్లు చేసుకోని విశ్వకిరణ్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇప్పటి వరకు ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం తిరుపతి, బెంగుళూరు, చెన్నై నగరాలకు వెళ్ళాల్సి వచ్చేదని, రూ.4 నుంచి రూ. 8 లక్షల వరకు ఖర్చుచేయాల్సి వచ్చేదన్నారు. అలాంటిది పేదలకు అందుబాటులో మదనపల్లెలో ఉచితంగా సర్జరీ చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతనంగా ఎన్నికైన మండల స్థాయి కమిటీ

పంచాయతీ కార్యదర్శుల మండల స్థాయి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల స్థాయి పంచాయతీ కార్యదర్శుల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ కమిటీ నూతన అధ్యక్షులు ఎ.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.బాలరాజు ఆధ్వర్యంలో మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన నూతన కమిటీని ఎన్ను కున్నట్లు తెలిపారు. ఈ కమిటీలో అధ్యక్షులుగా ఎ.వెంకట రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.గాయత్రి, కోశాది. కారిగా ఇ.నాగభూ షణం, ప్రధాన కార్యదర్శిగా టి.గౌతమి, మీడియా ప్రతినిధిగా ఎ.రజిత, కమిటీ సభ్యులుగా జి.సరస్వతి, కే.రాజేష్, ఎస్.నౌరిన్, బి.రాజశేఖర్‌నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూత నంగా ఎన్నుకోబడిన కమిటీ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తుం దన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిం చుకోవడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తుందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీకి సహ ఉద్యోగులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గ వైసిపి విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం పట్టణంలోని బత్తలాపురం రోడ్డులో గల పిఎన్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రెడ్డి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, జిల్లా పరిశీలకులు కడప మేయర్ సురేష్‌బాబు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల కన్వీనర్లు, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

పి4పై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి-4పై గురువారం ఊటుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీకాంత్ ఆధ్వర్యంలో డి.బి.ఎన్ పల్లె అరుంధతి వాడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి ఆపన్న హస్తం అందించే మార్గదర్శి కుటుంబాలు ద్వారా చేయూత అందించి ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. డిబిఎన్ పల్లె అరుంధతివాడలో అలాంటివి మూడు కుటుంబాలు గుర్తించామని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించడంతోపాటు మార్గదర్శి కుటుంబాల ద్వారా చేయుతనివ్వడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు టి.నరసింహులు, ఎం.బాలనర్సయ్య, టి.హరికృష్ణ, సుబ్బరాయుడు, ఎస్.నరసింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మదన్మోహన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మదన్మోహన్ జన్మదిన వేడుకల్లో టిడిపి నాయకులు

టిడిపి మండల ఇన్‌ఛార్జి యనుమల మద న్మోహన్ జన్మదిన వేడు కలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. పార్టీ నాయ ఒకులు, కార్యకర్తలు భారీగా బాణసంచ పేల్చి, దుశ్శాలువాలు, గజ మాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో41 కిలోల భారీ కేక్ కటింగ్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంచిఎట్టారు.పందిళ్ళపల్లెలో యనమల మదన్మోహన్ జన్మదినసందర్భంగా వీరభిమాని శివాజీ సమక్షంలో భారీగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల నాయకులు షేక్ ఆరిఫ్, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎండి షఫీ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు నిందితులు అరెస్టు, ఒకరు పరారీ

ప్రజాశక్తి-పీలేరు

ఎర్రచందనం అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు వాహనాలతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పీలేరు అటవీశాఖ సంచార దళ నిఘా విభాగం డిఎఫ్ఒ గురు ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున చిత్తూరు జిల్లా, పులిచెర్ల-కల్లూరు మార్గంలోని రైల్వే బ్రిడ్జి వద్ద తాను తమ సిబ్బందితో కాపు కాసామన్నారు. ఈ సందర్భంగా టాటా ఇంస్టా లగేజ్ వాహనం, టవేరా వాహనాలను తనిఖీ చేసి, అందులోనే ఎనిమిది ఎర్రచందనం దుంగలను వాహనాలతో సహా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తిరుపతి బొమ్మ గుంటకు చెందిన నరసింహులు, పవన్‌కల్యాణ్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మరో నిందితుడైన మల్లికార్జున పరారీలో ఉన్నాడని అన్నారు. పట్టుబడిన 181 కేజీల బరువు గల 8 ఎర్రచందనం దుంగలతో పాటు రెండు వాహనాల విలువ సుమారు రూ.13,68,707లు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ దాడిలో తనతో పాటు ఎఫ్‌ఆర్ఒ ఎస్. చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఒ కె. ప్రకాష్ కుమార్, ఎఫ్‌బిఒలు కె.ప్రతాప్, ఎ.రెడ్డి ప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు చరణ్, దేవేంద్ర పాల్గొన్నారు.

పట్టుబడిన ఎర్రచందనం, వాహనాలు, నిందితులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం